జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 13-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 615 పేజీలు: 4 వెల : రూ.7




# యువతిపై.. హత్యాయత్నం

**పలాస, మార్చి 12 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కొండివీధిలో బుధవారం అర్ధరాత్రి జరిగిన దారుణ ఘటన స్థానికంగా సంచలనమైంది. ఒక చిన్న వాట్సాప్ మెసేజ్ వివాదం చివరకు హత్యాయత్నానికి దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కొండివీధికి చెందిన గంధం కామేశ్వరరావు కుటుంబం, పొరుగింట్లో డొక్కర రామారావు (బుజ్జి) కుటుంబం నివాసముంటున్నారు. కామేశ్వరరావు పెద్ద కుమారుడు గంధం సాయి.. రామారావు కుమార్తె దేవిక అలియాస్ మౌనిక మొబైల్‌కు బుధవారం రాత్రి వాట్సాప్‌కు 'డార్లింగ్' అంటూ మెసేజ్ పంపించాడు. దీంతో రామారావుతో పాటు దేవిక ఈవిషయమై గంధం సాయిని నిలదీశారు. ఇదే సమయంలో మద్యం మత్తులో అక్కడికి వచ్చిన గంధం కామేశ్వరరావు, కుమారులు సాయి, సాగర్‌లతో కలిసి దేవిక కుటుంబంతో వాగ్వాదానికి దిగారు. వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో గంధం సాగర్ కత్తితో దేవిక పొట్టపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. రక్తపు మడుగులో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లారు. ప్రస్తుతం దేవిక ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. దేవిక కుటుంబీకులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని గంధం కామేశ్వరరావు, గంధం సాయి, గంధం సాగర్‌లను అదుపులోకి తీసుకున్నారు. యువతిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈవిషయం గురువారం పలాస కాశీబుగ్గ పట్టణంలో కలకలం సృష్టించింది. కాగా, ఇరు కుటుంబాల మధ్య ఇంటి నిర్మాణం విషయంలో గొడవ జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. కత్తిపోటుకు గురైన యువతి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ తెలిపారు.

* డార్లింగ్ అంటూ రాత్రిపూట యువతికి పక్కింటి యువకుడు వాట్సాప్ మెసేజ్ * నిలదీసిన యువతి కుటుంబీకులు * ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం * కత్తితో యువతిని పొడిచేసిన యువకుడు * పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి కుటుంబీకులు * రిమ్స్‌లో చికిత్స పొందుతున్న యువతి * పలాస కాశీబుగ్గలో కలకలం



## గంజాయి తరలిస్తున్న కేరళవాసి అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, మార్చి 12 (వార్త):** గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేరళకు చెందిన వ్యక్తిని లావేరు పోలీసులు గురువారం పట్టుకున్నారు. సుభద్రపురం జంక్షన్ వద్ద ఎస్ఐ, పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, కేరళ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ రవూఫ్ (43) పారిపోతుండగా పట్టుకున్నారు. అతని బ్యాగును తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్‌రవూఫ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం కూర్గ్ జిల్లాకు చెందిన మహమ్మద్ అలీ అనే వ్యక్తి సూచన మేరకు, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన రాజు ఏ నాగేన్ ప్రధాన్ వద్ద నుండి గంజాయి తీసుకురావాలని చెప్పి, దానికి గాను రూ.15,000 ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నట్లు అబ్దుల్ రవూఫ్ వెల్లడించాడు. దాని ప్రకారం ఒడిశా వెళ్లి గంజాయిని తీసుకుని నీలం రంగు బ్యాగులో పెట్టుకుని మహేంద్రగడ నుండి పర్లాకిమిడికి బస్సులో, అక్కడి నుండి పలాస వరకు మరో బస్సులో, పలాస నుండి సుభద్రపురం జంక్షన్ వరకు మరో బస్సులో వచ్చాడు. అక్కడి నుండి విశాఖపట్నం వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులకు అనుమానం రాకుండా ఉండేందుకు బ్యాగ్ అడుగున బట్టలు పెట్టి, వాటి మధ్యలో గంజాయి ప్లాస్టర్ ప్యాకెట్లు దాచిపెట్టి, పై భాగంలో మళ్లీ బట్టలు ఉంచి అక్రమ రవాణాకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జె ఆర్ పురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.అవతారం వెల్లడించారు.

## పార్టీ బలోపేతానికి సాధక్‌లు కృషి చేయాలి

* జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు
* సుభద్రపురంలో సాధక్‌లతో సమావేశం

**శ్రీకాకుళం, మార్చి 12 (వార్త):** జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క సాధక్ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు సూచించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం సుభద్రపురంలో జనసేన సాధక్‌లతో గురువారం నిర్వహించిన సమావేశంలో నాగబాబు పాల్గొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంగా చురుగ్గా నిర్వహించాలన్నారు. పెద్ద ఎత్తున యువత పార్టీ సభ్యత్వ నమోదు తీసుకునేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాల్సిన బాధ్యత జనసైనికులపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించాలన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి డా.విశ్వక్ సేన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పెద్ద ఎత్తున జనసేన సాధక్‌లు పాల్గొన్నారు.














# ఒకేసారి.. మూడు రైల్వే హాల్టులు

* ఫలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ
* హరిశ్చంద్రపురం, మందస రోడ్, పాతపట్నంలలో మూడు రైళ్లకు నూతన హాల్టులు
* ఈ నెల నాలుగవ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చెంతకు సమస్య
* రామ్మోహన్ చొరవతో నేడు పరిష్కారం
* హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు



**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం జిల్లా వాసులకు శుభవార్తను మోసుకువచ్చారు. జిల్లా ప్రజల అవసరాలను పూర్తిగా తీర్చేవిధంగా ఒకేసారి మూడు రైళ్లకు సంబంధించి నూతన హాల్ట్‌లను మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి రైల్వే శాఖ ఉత్తర్వులు విడుదల చెయ్యగా.. వివరాలను రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. వీటి ద్వారా అభివృద్ధి వైపు బలంగా శ్రీకాకుళం అడుగులు వేస్తుందని స్పష్టం చేశారు. ఇక నూతనంగా మంజూరు అయిన హాల్టుల వివరాలను పరిశీలిస్తే.. గుణుపూర్, విశాఖపట్నం మధ్య తిరిగే ప్యాసెంజర్ ట్రైన్ నంబర్ 58505/06 ఇకపై హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ వద్ద ఆగనుంది. అదేవిధంగా రైలు నంబర్ 18525/26 బెర్హంపూర్-విశాఖపట్నం ప్యాసెంజర్ ఇకపై మందస రోడ్ రైల్వే స్టేషన్‌లో హాల్ట్ మంజూరు అయింది. వీటితో పాటు రూర్కెల జంక్షన్, గుణుపూర్ మధ్య తిరిగే రాజ్యా రాణి ఎక్స్‌ప్రెస్ 18117/18 ఇకపై పాతపట్నం లో కూడా ఆగి.. స్థానిక ప్రయాణీకులకు మరింత ఉపశమనం కల్పించనుంది. తాజా రైలు హాల్టుల గురించి ఇప్పటికే అనేక దఫాలుగా కేంద పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. రైల్వే అధికారులు, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో భేటి అయి అవసరాన్ని వివరించారు. ఈ నెల నాలుగవ తేదీన సైతం అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా చర్చించారు. వాటిలో కొన్ని మంజూరు కావడం పట్ల రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంజూరుకు పూర్తి తోడ్పాటు అందించిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త హాల్టుల ద్వారా అభివృద్ధి మరింత వేగం పెంచుకుంటుందని, ప్రజా రవాణాను మరింత సులభతరం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రతీ మూలలో అభివృద్ధిని చేరవెయ్యడానికి రవాణానే ప్రధాన సాధనం అని నమ్మే కూటమి సర్కారు.. ఆ దిశగా అన్ని ప్రయత్నాలు చేసి సఫలీకృతం అవుతున్నట్టు తెలిపారు. తాజా హాల్టులను జిల్లా ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి చొరవతో.. కొత్త హాల్టులు మంజూరు కావడం పట్ల జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రేపు జాతీయ లోక్ అదాలత్

**-జిల్లాలో 11,602 కేసుల గుర్తింపు**

**-20 బెంచ్ లు ఏర్పాటు**

**-జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా**

**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా గురువారం తెలిపారు. ఈ నెల 14న ఈ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌కు సంబంధించి జిల్లాలో 11,602 కేసులు గుర్తించామని, వీటి కోసం జిల్లాలో 20 బెంచ్‌లు ఏర్పాటు చేయగా, జిల్లా కేంద్రంలో 4 బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ లోక్ అదాలతలో రాజీపడదగ్గ కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్ సమయం, ధనం వృధా కాకుండా ఉంటుందని చెప్పారు. సివిల్ కేసులు రాజీ అయితే మొదట చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి చెల్లస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**నరసన్నపేట, మార్చి 12(వార్త):** ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి గురువారం తెలిపారు. స్థానిక చాంబర్లో మాట్లాడుతూ రాజీ ద్వారా పరిష్కరించుకునే కేసులను పోలీసులు గుర్తించి, వాటిని రాజీపడే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, డబ్బు వృథా చేసుకోవడం అవసరం లేదని తెలిపారు. కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల త్వరితగతిన న్యాయం లభిస్తుందని, ఇరుపక్షాలకు కూడా ఇది అనుకూలమని జడ్జి పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

## శ్రీరాములుకు డాక్టర్ సీదిరి పరామర్శ



**మందస, మార్చి 12(వార్త):** వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు మావిడెల్లి శ్రీరాములును మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన శ్రీరాములు భార్య అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ఆయన ఇంటికి వెళ్ళి, అనారోగ్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, హరిపురం గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన చిట్టి భాస్కరరావు



**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** బలగకు చెందిన చిట్టి భాస్కరరావు గురువారం భారతీయ జనతా పార్టీలో జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు సమక్షంలో చేరారు. ఆయనకు పార్టీ కండువాను వేసి తేజేశ్వరరావు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. యువ నాయకత్వం ముందుకు రావాలని కోరారు. తనను బలగ ప్రాంత ప్రజానీకం ఆశీర్వదించాలని కోరారు. ఆయనను ఈస్ట్ మండల జనరల్ సెక్రటరీగా బీజేపీ జిల్లా నాయకత్వం నియమించింది.

## గిట్టుబాటు ధరలేక క్యాబేజీ రైతుల ఆవేదన

**- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాగుదారులు**



**సారవకోట, మార్చి 12(వార్త):** తొగిరి, పద్మాపురం తదితర గ్రామాల్లో క్యాబేజీ సాగు చేస్తున్న రైతులు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో సుమారు 50 కుటుంబాలకు చెందిన రైతులు క్యాబేజీ సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో క్యాబేజీ పువ్వు ధర రూ.5 నుంచి రూ.10 వరకు మాత్రమే ఉండటంతో రైతులకు ఖర్చులు కూడా తిరిగి రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో సరైన ధర లభించకపోవడంతో కొంతమంది రైతులు గ్రామాల మధ్య తిరుగుతూ క్యాబేజీని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సాగు ఖర్చులు పెరిగిన ఈ సమయంలో ధరలు పడిపోవడం వల్ల నష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి క్యాబేజీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ట్రాఫిక్ పెనాల్టీలు వెంటనే చెల్లించాలి

**- నరసన్నపేటలో వాహనాల తనిఖీలు**

**నరసన్నపేట, మార్చి 12(వార్త):** ద్విచక్ర వాహనాలకు సంబంధించిన పెనాల్టీలను వాహన యజమానులు తక్షణమే చెల్లించాలని ఏఎస్ఐ శేఖర్ సూచించారు. గురువారం నరసన్నపేట ప్రధాన రహదారిలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ద్విచక్ర వాహనాలను పరిశీలించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శేఖర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో వాహనాలపై నమోదు అయిన పెనాల్టీలను యజమానులు వెంటనే చెల్లించేలా ముందుకు రావాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవడం వంటి నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



# పలాసలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్

**-పలాస చరిత్రలో నూతన అధ్యాయం**

**-ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారంలో చారిత్రక ముందడుగు**

**-ఎమ్మెల్యే శిరీష**



**పలాస, మార్చి 12 (వార్త):** దశాబ్దాలుగా ఉద్దానం ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారి సమస్య పరిష్కారంలో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక విజయం సాధించింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో మొట్టమొదటి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గౌతు శిరీష ఒక ఉద్విగ్నభరిత ప్రకటనలో తెలిపారు. తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇది కేవలం ఒక ఆపరేషన్ కాదని, ఉద్దానం ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న భరోసా అని, తమ చిత్తశుద్ధికి నిలువుటద్దం అని ఆమె పేర్కొన్నారు.

### తొలి ఆపరేషన్ వివరాలు: తండ్రే దాత..

ఈ చారిత్రాత్మక తొలి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను 27 ఏళ్ల హేమశ్రీ అనే యువతికి నిర్వహిస్తున్నారు. ఆమెకు కిడ్నీ దానం చేయడానికి ఆమె తండ్రి, క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మోహన్ రావు ముందుకు రావడం విశేషం. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, వైద్యులు పూర్తి బాధ్యత తీసుకుని ఈ ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. వైజాగ్, శ్రీకాకుళం నుండి ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో నిపుణులైన వైద్య బృందాన్ని ఈ ఆపరేషన్ కోసం పలాసకు రప్పించారు.

### ప్రభుత్వ చిత్తశుద్ధి, పెట్టుబడులు..

గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి భిన్నంగా, కూటమి ప్రభుత్వం ఉద్దానం సమస్యపై తమకున్న చిత్తశుద్ధిని చేతల్లో చూపిస్తోందని శిరీష అన్నారు.

### రూ.12 కోట్ల కేటాయింపు..

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కోసం మొత్తం 12 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 9 కోట్లు అత్యవసర వైద్య పరికరాలు, పనిముట్ల కోసం, మిగిలిన 3 కోట్లు రీసెర్చ్ గ్రాంట్‌గా కేటాయించారు. నూతన డయాలసిస్ యూనిట్లును స్నేహితులు, కలెక్టర్ సహకారంతో ఐఓసీల కంపెనీ సిఎస్ఆర్ నిధుల ద్వారా 10 కొత్త డయాలసిస్ యూనిట్లను తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆమె స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి రీసెర్చ్: అమెరికా నుండి నిపుణులైన డాక్టర్లను రప్పించి, జాతీయ ఇన్స్టిట్యూట్ సహకారంతో కిడ్నీ వ్యాధి మూలాలను కనుగొనేందుకు రీసెర్చ్ ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు.

### "ఇల్లు అలకగానే పండగ కాదు":

గత ఐదేళ్లలో మంత్రిగా ఉండి, స్వయానా వైద్యుడైన మాజీ మంత్రి అప్పలరాజు, ఎన్నికలకు కేవలం నాలుగు నెలల ముందు ముఖ్యమంత్రిని పిలిపించి ఆసుపత్రిని ప్రారంభించారని, అయితే అది కేవలం కంటితుడుపు చర్యేనని విమర్శించారు. "ఇల్లు అలకగానే పండగ కాదు" అన్న సామెతను గుర్తు చేస్తూ, భవనం కడితే సరిపోదని, దానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

### ఒక్క మిషన్ కూడా తీసుకురాలేకపోయారు ..


2014-19 మధ్య చంద్రబాబు నాయుడు మంజూరు చేసిన 10 డయాలసిస్ యూనిట్లను కొత్త భవనంలోకి మార్చి, తానేదో ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకున్నారే తప్ప, ఒక మంత్రిగా ఒక్క కొత్త డయాలసిస్ మిషన్‌ను కూడా తేలేకపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడి దూరదృష్టిఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి పునాది వేసింది శ్రీ చంద్రబాబు నాయుడునని శిరీష గుర్తుచేశారు. 2018లో తిత్లీ తుఫాను సమయంలో 12 రోజులు పలాసలోనే ఒక బస్సులో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించినప్పుడు, ఈ ప్రాంతానికి ఒక శాశ్వత పరిష్కారం కోసం కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు ఆయన సంకల్పం చేశారని తెలిపారు. అంతకుముందు 2014-19 హయాంలోనే పాలకొండ, టెక్కలి, పలాస, హరిపురం, ఇచ్ఛాపురంలలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి, రోగులు విశాఖపట్నం వెళ్లే భారాన్ని తగ్గించిన ఘనత కూడా ఆయనదేనని అన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం సాకారం కావడానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, వైద్య శాఖా మంత్రి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, ప్రతి ఒక్కరికీ ఉద్దానం ప్రజల తరపున ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు డయాలసిస్ కోసం విశాఖపట్నం, కిడ్నీ మార్పిడి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన దుస్థితి నుండి, ఈరోజు పలాసలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగే స్థాయికి ఎదగడం కూటమి ప్రభుత్వ విజయానికి ప్రతీక అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అపురూపం.. వాసుదేవుని అభిషేకం

**-భక్తులకు స్వామి నిజరూప దర్శనం**

**-ఉత్తర ద్వారదర్శనంతో తరించిన జనం**

**-సర్వాలంకృతుడైన వాసుదేవ పెరుమాళుడు**



**మందస, మార్చి 12(వార్త):** భక్తుల కొంగు బంగారం వాసుదేవుని ప్రత్యేక అభిషేకాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో వాసుదేవపెరుమాళునికి క్షీర, పసుపు, జలాభిషేకాలను వేదమంత్రోచ్ఛారణల మధ్య గావించారు. అనంతరం పుష్పాలంకరణ చేశారు. సర్వాలంకృతుడైన వాసుదేవుడు మహిమాన్వితునిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి జన్మనక్షత్రం కావడంతో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. వాసుదేవ పెరుమాళుని నిజస్వరూపం, అభిషేకం, సర్వాంకృతుని కనులారా దర్శనం చేసుకున్న భక్తులు తన్మయం చెందారు. అనంతరం స్వామి తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

## వైసీపీలోకి టీడీపీ కార్యకర్తల చేరిక



**నరసన్నపేట, మార్చి 12(వార్త):** పోలాకి మండలం కొత్తరేవు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం వైసీపీ పార్టీలో చేరారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వైసీపీ ఆవిర్భావ కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ పార్టీలో చేరిన కార్యకర్తలను స్వాగతించారు. వైసీపీ బలోపేతానికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది కార్యకర్తలు వైసీపీలో చేరినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృష్ణ చైతన్య తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సూరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భేతాళపురంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



**మందస, మార్చి 12(వార్త):** భేతాళపురంలో పలాస నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్సార్సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రజల కష్టాలను రాజశేఖర్ రెడ్డి తనయుడిగా ఆ మహానేత వేసిన బాటలో నడిచి, ప్రజల కష్టాలను పాదయాత్రతో నేను విన్నాను, నేనున్నాను అంటూ ప్రజలకు భరోసా కల్పిస్తూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా మొదలు పెట్టిన వైఎస్సార్సీపీ ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని 2019లో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రజా సంక్షేమం-అభివృద్ధి, స్త్రీ సమానత్వం, రైతు సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తుకై అహర్నిశలు తపించి, గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పి దేశంలోనే మన రాష్ట్రాని ఆదర్శంగా నిలిపిన జననేత జగనన్న నాయకత్వంలో పార్టీ 15వసంతాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టి.అప్పలస్వామి, ఎస్.కృష్ణారావు, కె.మోహనరావు, జి.కపిల్, ఎం.రుషి, జె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీలు

**-ఈ నెల 28 వరకు ప్రక్రియ**

**- ఎంపీడీవో చిన్నమ్మడు**

**జలుమూరు, మార్చి 12(వార్త):** ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు జలుమూరు ఎంపీడీవో చిన్నముడు తెలిపారు. బుధవారం సాయంత్రం జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ తనిఖీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గత ఏడాది ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులను గ్రామస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ సామాజిక తనిఖీల ప్రక్రియ ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. అనంతరం ప్రజల ముందే వివరాలను వెల్లడించేలా ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని ఎంపీడీవో కోరారు.



### వయోజన విద్య పరీక్షలను..

# నిష్పక్షపాతంగా నిర్వహించాలి

**-మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు**

**పలాస, మార్చి 12 (వార్త):** వయోజన విద్య పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని పలాసమున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఉల్లాస్-నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో గతంలో గుర్తించబడిన నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురపాలక సంఘంలోని 16 సచివాలయంల పరిధిలో వయోజన విద్యను అభ్యసించి పూర్తిచేసిన మహిళలందరకు పరీక్షలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. మెప్మా సి ఎల్ ఆర్ పి లు, ఆర్పీలతో ముందస్తు సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు నిర్వహించారు.

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించినట్లు తెలిపారు. వయోజన విద్య అభ్యసించిన మహిళలందరికి సచివాలయాలు, స్థానిక పాఠశాలలో పరీక్షలను నిష్పక్షపాతంగా ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా నిర్వహించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మేనేజర్ త్రినాథరావు, మెప్మా సీఎం ఎం.మోహన్, సిఎల్ఆర్పిలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.




## ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దు

**- విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన**

**జలుమూరు, మార్చి 12(వార్త):** విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని టెక్కలి శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, కే. గణేష్ సూచించారు. గురువారం జలుమూరు మండలం చల్లవానిపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిస కాకూడదని పిలుపునిచ్చారు. శక్తి యాప్ ద్వారా పోలీసుల సహాయం త్వరగా పొందవచ్చని, ఇది మహిళలు మరియు విద్యార్థుల భద్రతకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**-ఈ నెల 23లోగా దరఖాస్తులు అందజేయాలి**

**-ఎ.పి బి.సి స్టడీ సర్కిల్ సంచాలకురాలు ఇ.అనూరాధ**

**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** రైల్వే రిక్రూట్ మెంట్ గ్రూప్ – డి పరీక్షలకు ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, ఎపి బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ. అనూరాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ లోగా ఎ.పి.బి.సి.స్టడీ సర్కిల్, శ్రీకాకుళం వారికి దరఖాస్తు చేసుకోవాలని, 100 మంది అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్, స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులను 10వ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థులకు ఈ నెల 25నుంచి ఉచిత శిక్షణా తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొ న్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి మార్కుల లిస్టు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్,గ్రూప్–డి 2026 దరఖాస్తు జిరాక్స్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి, బి.సి. స్టడీసర్కిల్, 80 ఫిట్ రోడ్, వాంబే కోలనీ, శ్రీకాకుళంలో అందజేయాలన్నారు. వివరాలకు బిసి స్టడీ సర్కిల్ ఫోన్ నెం. 8332852106, 7382975679లను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్వచ్ఛ రథం..పల్లెలు పరిశుభ్రం

**-ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి విముక్తి**

**జి.సిగడాం, మార్చి 12(వార్త):** ప్రజల సహకారంతో 'స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యం నెరవేరుతుందని, దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణ వద్ద అయెన స్వచ్ఛ రథాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని, చెత్తను రోడ్లపై, ఆరుబయట పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందించి సహకరించాలన్నారు.భవిష్యత్తులో అన్ని గ్రామ పంచాయతీల్లో నూరు శాతం పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొనసాగిస్తున్న స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎంపీడీఓ జి. రామకృష్ణారావు మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామ రూపకల్పనకు చేపట్టిన స్వచ్ఛ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.ప్రజలు తమ వద్ద పాత సామగ్రి ఇచ్చి ప్రతిఫలంగా నిత్యావసరాలు పొందవచ్చున్నారు.గ్రామాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ మరియు ఇతర వ్యర్థాలను సమూలంగా తొలగించి, ప్రజల్లో పారిశుధ్యం – పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచాలనే సంకల్పంతో ఈ స్వచ్ఛ రథాన్ని ప్రజలకు అందుబాటులోకి ప్రభుత్వం అందుబాటులోని తీసుకొచ్చిదన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ప్రభుత్వం నిర్దేశించిన రేటుకు స్వచ్ఛ రథం వద్ద అందించి, అదే విలువకు నిత్యావసర వస్తువులు పొందవచ్చున్నారు.




ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మురళీ, కూటమి మండల అధ్యక్షులు కుమరాపు రవి కుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవి కుమార్, ఎఎంసీ ఉపాధ్యక్షులు బురాడ'వెంకటరమణ, మండల పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథం,నక్క మురళీ, టీడీపీ సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు, పైల బాజ్జీ నాయుడు, కుదిరెళ్ల వెంకటప్పారావు, జిల్లా బీజేపీ కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, జనసేన సీనియర్ నాయకులు భూపతి అర్జున్ కుమార్, తాళ్లబత్తుల పైడిరాజు, సర్పంచ్లు ముద్దాడ ఈశ్వరమ్మ, సాకేటి నాగరాజు, కామోజుల సీతారాం, మహా దాస్యం చిన్నారావు, బోగాది అప్పలనాయుడు, పలిశెట్టి సూర్యనారాయణ, కూటమి నాయకులు,మజ్జి కన్నంనాయుడు,పడాల అప్పన్న మాష్టారు, సత్యారావు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొండిపూడి విద్యార్థి లండ కౌశిక్ ప్రతిభ



**మందస, మార్చి 12(వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లండ కౌశిక్ మంచి ప్రతిభ చూపాడు. మందస మండల స్థాయిలో టాప్ ర్యాంకర్ గా నిలిచాడు. మందస మండల స్థాయిలో జరిగిన విజ్ఞాన వారోత్సవాలలో భాగంగా జరిగిన 6, 7, 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో లండ కౌశిక్ ప్రథమ స్థానం సాధించాడు. జిల్లా స్థాయికి కూడా ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు బి.సుందర్ సోలమన్ తెలిపారు. ఈనెల 17న శ్రీకాకుళంలో జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొని, ఈ పోటీల్లో విజయం సాధిస్తే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటాడని తెలియజేశారు. ఈ సందర్భంగా కౌశిక్ ను హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## పదో తరగతి విద్యార్థులకు 'ధర్మార్పు హరికృష్ణ' వితరణ



**మందస, మార్చి 12(వార్త):** కొత్తపల్లి గ్రామానికి చెందిన ధర్మార్పు హరికృష్ణ కొత్తపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. ఇదే పాఠశాలలో 10వ తరగతి చదువుతూ 10వ పరీక్షలకు హాజరుకాబోతున్న విద్యార్థులకు ఈ పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. హరికృష్ణ సోంపేట, మందస మండలాల్లో పలు ప్రైవేట్, జూనియర్ కాలేజీలలో జంతుశాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరాల్లో ఎస్ఎస్సీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా ఆయన ప్రత్యేక బహుమతులు అందజేసారని స్థానిక ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది, విద్యార్థులు దాతకి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి. సూర్యనారాయణ, జి.చిన్నికృష్ణ, ఎం.దామోదరం, తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన వీఆర్వోలు



**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 24 మంది గ్రేడ్–2 వీఆర్వోలకు గురువారం (12వ తేదీన) కలెక్టరేట్ లో కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్–1 వీఆర్వో లుగా పదోన్నతులు ఇచ్చినందుకు జిల్లా కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లకు ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణలకు, తమవంతు సహాయ సహకారాలు అందించిన రెవెన్యూ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ధన్యవాదాలు తెలిపిన వారిలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాజేష్ కుమార్, సహాధ్యక్షులు అప్పలనాయుడు, సెక్రటరీ బి.రాంజీ, ట్రెజరర్ జి.డిల్లేశ్వరరావు, కార్యవర్గం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కూన చొరవతో 2023 పిడుగుపాటు బాధితులకు పరిహారం



**ఆమదాలవలస, మార్చి 12(వార్త):** ఆముదాలవలస నియోజకవర్గంలో 2022–2023లో జరిగిన పిడుగుపాటు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ నష్ట పరిహారాన్ని మంజూరు చేయించారు. చోడవరపు వెంకట సత్యనారాయణ–అయ్యవారిపేట (బూర్జ మండలం), బురాడ అప్పలనాయుడు–బుడ్డి వలస (సరుబుజ్జిలి మండలం), దాసరి అప్పన్న–పాలవలస (సరుబుజ్జిలి మండలం) కుటుంబాలకు వారి అకౌంట్లోనే ఈ మొత్తాన్ని జమ చేస్తారు. లబ్ధిదారుల కుటుంబాలు ఎమ్మెల్యే రవికుమార్‌కి, సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ముత్యాలమ్మ కోనేరుకు మహర్ధస

**పలాస, మార్చి 12 (వార్త):** పలాస కాశీబుగ్గలో ఉన్న సుందరమైన పార్కు ముత్యాలమ్మ కోనేరు పార్కు కొత్త శోభనం సంతరించుకోబోతుంది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు చొరవ తీసుకొని పార్క్ అభివృద్ధికి సహకరించడం పట్ల వాకర్స్ క్లబ్ వారు హర్షం వ్యక్తం చేశారు. పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు సైతం పట్టణ అభివృద్ధిలో భాగంగా పార్కు మీద ప్రత్యేక దృష్టి సారించి నిధులను కేటాయించి మిగిలి ఉన్న ప్రహరీ గోడను పూర్తి చేయుటకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే పనితీరుకు ఇది నిదర్శనమని, గత పాలకుల వలన నిర్లక్ష్యానికి గురి అయిన పార్కు నేడు సుందరంగా తయారవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ సభ్యులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావుకి, మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులుకి ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.



# పోరాటయోధుడు.. సీతారామరాజు

**-నారాయణపురంలో అల్లూరి విగ్రహావిష్కరణ**

**మందస, మార్చి 12(వార్త):** అల్లూరి సీతారామరాజు.. తెల్లదొరల గుండెలను అదరగొట్టిన మహావీరుడని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురంలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గొప్ప స్వాతంత్ర్యసమరయోధుడని కొనియాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అలుపెరగని పోరాటం చేశారన్నారు. తెల్లదొరల దాస్య శృంఖలాల నుంచి భారతావనిని కాపాడడానికి ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడన్నారు. మంచి పోరాట పటిమతో పోలీసు ఠాణాలనే కొల్లగొట్టి, బ్రిటిష్ పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేశారన్నారు. అటువంటి వీరుని విగ్రహాన్ని ఉద్దాన గ్రామమైన నారాయణపురంలో ప్రతిష్టించుకోవడం అభినందనీయమన్నారు. గొరకల దామోదరం, పాపమ్మ దంపతుల కుమారుడు మాజీ సైనికుడు గొరకల సింహచలం, గీతారాణి దంపతులు విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, ఎంపీటీసీ ప్రతినిధి గొరకల కేశవరావు, పంచాయతీ పెద్దలు మడియా రామకృష్ణ, గొరకల పోలయ్య, గొరకల రామారావు, సివంగి వాసు, మురళీ, బంగారు ధర్మారావు, గొరకల పాపారావు, కర్రి ధర్మారావు, బంగారు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చూపిన కార్మికులు

**తోటి కార్మికుడు కుటుంబానికి ఆర్థికసాయం**

**మందస, మార్చి 12(వార్త):** వారంతా ఐక్యమత్యంతో తోటి కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసి, మానవత్వం చూపారు. మృతుని కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. మందస మండలంలోని అంబుగాం గ్రామానికి చెందిన పులారి లోకేశ్వరరావు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, ఇటీవల ఆయన హటాత్తుగా అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆ కుటుంబం అనాధగా మారింది. పరిస్థితిని గమనించి, లోకేశ్వరరావుతో పని చేసే తోటి కార్మికులు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. మృతుని కుటుంబానికి నవోదయ భవన నిర్మాణ కార్మికుల సంఘ సభ్యులు 50,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని లోకేశ్వరరావు భార్య పులారి జానకికి అందించారు. కార్యక్రమంలో నవోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బల్ల మాధవరావు, ప్రగతిశీల అధ్యక్షుడు దేవాడనారాయణరావు, మామిడి గోపాల్, తోట గోపాల్, మజ్జి శివకేశ్వరరావు, మజ్జి మాధవరావు, దేవాడ హేమరాజు, బల్ల దానయ్య, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సహాయంతోనే పారిశుధ్యం

**-రెంటికోటలో స్వచ్ఛతకు కొత్త శకం**

**- స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష**

**పలాస, మార్చి 12 (వార్త):** ప్రజల సహాయంతోనే పారిశుధ్యం సాధ్యమని, పారిశుధ్యమే దైవారాధనని, స్వచ్ఛమైన గ్రామమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాదని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం, రెంటికోట గ్రామంలో గురువారం ఆమె "స్వచ్ఛ రథం"ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో ఒక నూతన అధ్యాయం మొదలైందని, ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### స్వచ్ఛ రథం - ప్రగతికి మార్గం:

"స్వచ్ఛ రథం" అనేది కేవలం చెత్తను సేకరించే వాహనం కాదని, ఇది మన గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా మార్చే ఒక ఉద్యమానికి చిహ్నమని అన్నారు. ఈ ప్రత్యేక వాహనం ప్రతిరోజూ ఇంటింటికి వచ్చి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరిస్తుందని, దీని ముఖ్య ఉద్దేశ్యం, వీధుల్లో ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడాన్ని అరికట్టి, వ్యర్థాల నిర్వహణను ఒక క్రమ పద్ధతిలో చేపట్టడం. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను పునర్వినియోగం (రీసైక్లింగ్) కోసం పంపడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటమే దీని ప్రధాన లక్ష్యమని అన్నారు.

### ప్రజల భాగస్వామ్యమే కీలకం - ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ "ప్రభుత్వం స్వచ్ఛ రథాన్ని అందించడం ఒక బాధ్యత అయితే, దాన్ని సద్వినియోగం చేసుకొని మన గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి చెత్తను తడి, పొడిగా విభజించి ఈ రథానికి అందించాలని విజ్ఞప్తి చేశారు. మన వీధులను, మన పరిసరాలను మన ఇల్లులాగే శుభ్రంగా ఉంచుకున్నప్పుడే సంపూర్ణ స్వచ్ఛత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ స్వచ్ఛ యజ్ఞంలో పిల్లల నుండి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్పుడే మనం వ్యాధిరహిత, ఆరోగ్యకరమైన రెంటికోటను నిర్మించగలం," అని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా రెంటికోట గ్రామం స్వచ్ఛత, ఆరోగ్య రంగాల్లో ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కుత్తుమ లక్ష్మణ్, టిడిపి సీనియర్ నాయకులు బూర్ల కృష్ణంరాజు, దువ్వాడ సంతోష్ నాయుడు, మాజీ ఎంపీటీసీ హోరియా మోహన్ రావు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఐఐఐటీ నూతన డైరెక్టర్‌గా అమరేంద్రకుమార్




**ఎచ్చెర్ల, మార్చి 12(వార్త):** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాల యం (ఐఐఐటీ) నూతన సంచాలకుడిగా ప్రొఫెసర్ సంద్ర అమరేంద్ర కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తరగతుల నిర్వహణలో మెరుగుదల, విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాల పెంపునకు ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అమరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి వాసు, రెండో ప్రాంగణ పర్యవేక్షకులు సాగర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గాయపడిన కమిటీ టీచర్‌కు ఆర్థిక సాయం



**మందస, మార్చి 12(వార్త):** బహడపల్లి జడ్పీ హైస్కూల్‌లో కమిటీ టీచర్‌గా పనిచేస్తున్న భాష్యం మోహనరావు ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న 2002–2003 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలిసి తమ గురువుకు అండగా నిలుస్తూ రూ.34వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తమ గురువు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షిస్తూ, ఎల్లప్పుడూ తమకు మార్గదర్శకులుగా ఉన్న ఆయనకు ఈ చిన్న సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. గురువుపట్ల ఉన్న గౌరవం, ప్రేమకు ఈ సహాయం ఒక మంచి ఉదాహరణగా నిలిచిందని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మర్ల సంతోష్, భూపతి, వల్లభరావు, కుర్మారావు, రమేష్, తులసి, హేమలత, భువనేష్, తాతారావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి




**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** బొడ్డేపల్లి రాజగోపాలరావు అంటే ఒక వ్యక్తి కాదు.. ఒక వ్యవస్థ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాజగోపాలరావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఆరు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై జిల్లా ఖ్యాతిని ఢిల్లీలో ఇనుమడింపజేసిన వ్యక్తని ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లాకు వంశధార ప్రాజెక్టును తీసుకురావడంలో ముఖ్యభూమిక పోషించినట్లు కొనియాడారు. ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. అదే స్ఫూర్తితో నేడు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు.

## నేడు కవయిత్రి మొల్లమాంబ జయంతి

### -జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, మార్చి 12(వార్త):** ఈ నెల 13న కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) జయంతి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 13వ తేదీన ఉదయం 10.30 గంటలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, బిసి సంఘ నాయకులచే కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) వారి చిత్రపటానికి పుష్పమాలాంకరణ, అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులకు అభ్యాస స్థాయి శిక్షణ




**సారవకోట, మార్చి 12(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న అభ్యాసన స్థాయి శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు మడ్డు వెంకటరమణ, కే. భూలక్ష్మి తెలిపారు. గురువారం సారవకోట మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు శ్రీకాకుళం బాలుర హైస్కూల్లో అభ్యాస స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపరచడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు

### - ప్రమాదాలపై స్థానికుల ఆందోళన



**నరసన్నపేట, మార్చి 12(వార్త):** నరసన్నపేటలో ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను రవాణా చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం నరసన్నపేటలోని పోలాకి జంక్షన్ వద్ద ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణం చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఒక ఆటోలో అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ మందిని ఎక్కించుకుని ప్రయాణించడం వల్ల ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయాణికులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బైక్ ఢీకొని యువకుడికి గాయాలు



**సారవకోట, మార్చి 12(వార్త):** అలుదు గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తంప గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ గాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం వడ్డినవలస నుంచి సారవకోట వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న సంతోష్ కుమార్‌ను మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆయనకు గాయాలు అయ్యాయి. గాయపడిన సంతోష్ కుమార్‌ను వెంటనే సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) తరలించి వైద్యులు చికిత్స అందించారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## నరసన్నపేటలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

### -పార్టీ జెండా ఏగురవేసినా ధర్మాన కృష్ణదాస్

**నరసన్నపేట, మార్చి 12(వార్త):** నరసన్నపేటలోని వైసీపీ కార్యాలయంలో గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పాల్గొని తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా వైసీపీ ఆవిర్భావ వేడుకలు

### -కార్యకర్తల్లో కొత్త ఉత్తేజాన్ని నింపిన డాక్టర్ సీదిరి



**పలాస, మార్చి 12 (వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకొని 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గురువారం పలాస నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలాసలోని ప్రగతి భవన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గత 15 సంవత్సరాలుగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, పేదలు అన్న తేడా లేకుండా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ద్వారా ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయినప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం నాయకులు, పార్టీ క్యాడర్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక శిక్షణ




**ఇచ్ఛాపురం, మార్చి 12(వార్త):** జేసీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ ప్రేరణాత్మక కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించడం, పరీక్షల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం రాబోయే బోర్డు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం లక్ష్యంగా వివిధ సూచనలు అందించారు. జేసీఐ అధ్యక్షుడు జేసీ బోయిన శ్రీవన్ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి ప్రోత్సాహం ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు వారి భవిష్యత్తు జీవితానికి ఎంతో ముఖ్యమని వివరించి, పరీక్షలను ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడానికి అవసరమైన సూచనలు అందించారు. జోన్ కోఆర్డినేటర్ (ట్రైనింగ్) జెఎఫ్ఎమ్ కాళ్ల జైదేవ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం కావడానికి అవసరమైన మార్గదర్శకాలు తెలిపారు. జోన్ కోఆర్డినేటర్ (కమ్యూనిటీ డెవలప్మెంట్) జెఎఫ్‌డీ తంగుడు శణ్ముఖ్ విద్యార్థులకు అభినందనలు తెలియజేసి పరీక్షల విజయానికి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ జేసీ డా.మట్ట శ్రీనివాస్ విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థికి ఉచితంగా ఇంటర్మీడియట్ సీటును అందజేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎంతో ప్రోత్సాహం పొందారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ కార్యదర్శి జేసీ డా. సంతోష్ సాహు, సభ్యులు జేసీ అభిలాష్ వాజరాపు, జేసీ ఆసి ధర్మరాజ్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ జేసీఐ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, డైరెక్టర్ ఆఫ్ ట్రైనింగ్ డా. మట్ట శ్రీనివాస్ ఉత్తమ విద్యార్థికి ఉచిత ఇంటర్మీడియట్ సీటు అందజేయడం గొప్ప విషయం అని ప్రశంసించారు. జేసీఐ సమాజ సేవలో విద్యార్థుల అభివృద్ధిలో తన సేవాభావాన్ని మరోసారి నిరూపించుకుంది.

## మ్యాపింగ్‌ను గడువులోగా పూర్తి చేయాలి



**పలాస, మార్చి 12 (వార్త):** స్థానిక ఎన్నికల దృష్టిలో పెట్టుకొని బిఎల్వోలు గడువులోగా పూర్తి చేయాలని పల ఆర్డీవో ఆర్ అప్పలరాజు ఆదేశించారు. గురువారం పలాస నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) నం.02, రెవెన్యూ డివిజనల్ అధికారి పలాస ఆర్. అప్పలరాజు తహసీల్దార్ కార్యాలయంలో పలాసలో మ్యాపింగ్ పనులలో తక్కువ పురోగతి ఉన్న బూత్ లెవల్ ఆఫీసర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మ్యాపింగ్ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత బి ఎల్ వో లకు ఆదేశించారు. మ్యాపింగ్ పనులలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి, వజ్రపుకొత్తూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీతారామయ్య, మందస కింతలి రామకృష్ణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వి.గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ



**నరసన్నపేట, మార్చి 12(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో రక్తహీనత నివారణ కోసం వైద్య శాఖ ఆధ్వర్యంలో ఐరన్ మాత్రలు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు కే. పుణ్యవతి తెలిపారు. నరసన్నపేట మండలం అంపలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం పుణ్యవతి మాట్లాడుతూ ఐరన్ మాత్రలు తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో రక్త వృద్ధి పెరిగి, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## నిచ్చెనపై నుంచి పడి ఒకరి మృతి



**నరసన్నపేట, మార్చి 12(వార్త):** నరసన్నపేట మండలం మడపాం గ్రామానికి చెందిన కిశోర్‌కుమార్ నిచ్చెనపై నుంచి పడి గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఈ నెల 11న మాకివలస గ్రామంలో కేబుల్ పనులు నిర్వహిస్తున్న సమయంలో కిషోర్ కుమార్ నిచ్చెనపై నుంచి జారి కిందపడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే మాకివలస పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జలుమూరులో నేడు విద్యుత్ సరఫరా బంద్

### - మరమ్మతులతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం



**జలుమూరు, మార్చి 12(వార్త):** జలుమూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 33/11 కేవీ బుధితి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 33 కేవీ లైన్లకు సమీపంలోని చెట్టు కొమ్మలను తొలగించడం, మరమ్మతులు చేపట్టడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మార్చి 13, 2026 (శుక్రవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ సమయంలో జలుమూరు మండలంలోని కొమనపల్లి, ఎలమంచిలి, అక్కురడ, కొండ పోలవలస, కత్తిరివానిపేట, దోమనపల్లి, మెత్తపేట, సురవరం, చెన్నైవలస, అచ్యుతాపురం, నగరికటకం, శ్రీముఖలింగం, కరకవలస, బైదలపురం, పర్లం, పర్లం మాకివలస, రామకృష్ణాపురం, ఆంధవరం, రామదాసుపేట, జోగులపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు. మరమ్మతు పనులు సక్రమంగా పూర్తిచేయడానికి ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్కలి) ఈ. నరసింహా కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ

**జలుమూరు, మార్చి 12(వార్త):** విద్యార్థుల అభ్యాసన స్థాయిని పెంచేందుకు విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గత రెండు రోజులుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా 3, 6, 9వ తరగతి విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసేందుకు అవసరమైన పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల నేర్చుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546